ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్



బ్లాక్ ఫిల్మ్‌ను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

గోల్కొండ: లంగర్‌హౌస్ ట్రాఫిక్ పోలీసులు సోమవారం బాపూఘట్, టిప్పుఖాన్ బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కారు గ్లాస్‌లకు బ్లాక్ ఫిల్మ్ పెట్టడం, నిబంధనలను ఉల్లంఘించి అమర్చిన హారన్‌లకు వ్యతిరేకంగా ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని లంగర్‌హౌస్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య తెలిపారు. ఈ సందర్భంగా కారు డోర్ గ్లాస్‌లకు అమర్చిన బ్లాక్ ఫిల్మ్‌ను తొలగించాలని వాటి యజమానులకు జరిమానా విధించడంతో పాటు కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. అదే విధంగా శబ్ద కాలుష్యానికి కారణం అయ్యే నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన హారన్‌లను కూడా తొలగించామన్నారు.

వార్షికోత్సవం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

గోల్కొండ: గుడిమల్కాపూర్‌లోని వివేకానంద స్కూల్ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ క్రీడాపోటీలు, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దోమలగూడ ప్రభుత్వ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాంరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వివేకానంద పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు క్రీడల్లోనే కాకుండా ఇతర అంశాల్లో కూడా ప్రోత్సహించాలని సూచించారు. గుడిమల్కాపూర్ తాళ్లగడ్డ రాజలింగయ్య కబడ్డీ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కరస్పాండెంట్, గాదె శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ రేష్మారెడ్డి, చైర్మన్ కమలేష్‌కుమారితో విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



గన్‌ఫౌండ్రీ: శ్రీ సాయి నటరాజ అకాడమీ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్ ఆధ్వర్యంలో ప్రముఖ నృత్య గురువు డాక్టర్ పి.రమాదేవి శిష్యురాలు బోరుగంటి మేఘన కూచిపూడి నాట్య రంగప్రవేశం సోమవారం రవీంద్రభారతిలో కనుల పండువగా సాగింది. మహాగణపతి రౌత్వం, సరసిజానంభ సోదరి, మాధవి మమదేవ, థిల్లాన, వింటావ యశోధ వంటి పలు అంశాలపై చక్కటి హావాభావాలతో సాగిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ పురస్కార గ్రహీత ఉమామహేశ్వరీ, శాసన సభ్యులు కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత కళాకృష్ణ, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఆర్.చంద్రమౌళి, తెలుగు విశ్వవిద్యాలయం నృత్య బోధకులు డాక్టర్ విజయ్‌పాల్ పాల్గొన్నారు.

‘ఆర్యవైశ్య మహాసభ ఎన్నికల్లో ధర్మబద్ధమైన ఓటు వేయండి’



రమణయ్య

అఫ్జల్‌గంజ్: ఆర్యవైశ్య మహా సభకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగే మొట్టమొదటి ఎన్నికలలో ప్రతి ఒక్కరూ వాసవీ మాత సాక్షిగా ధర్మబద్ధంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని తెలంగాణ రాష్ట్ర టింబర్ ఫెడరేషన్ అధ్యక్షుడు చకిలం రమణయ్య పేర్కొన్నారు. ఓటు హక్కు ఎంతో విలువైందని న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్యులకు అంకిత భావంతో పనిచేసే నాయకుడికి ఓట్లు వేసి గెలిపించుకోవాలన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇంత వరకు మహాసభకు ఎన్నికలు కాలేదన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలకు ఎంతో విలువ ఉంటుందని పేర్కొన్నారు. ఆర్యవైశ్యుల కులదేవత వాసవి కన్యకా పరమేశ్వరీ సాక్షిగా ధర్మాన్ని రక్షించడానికి ఓటు హక్కు ఉన్నవారందరూ మార్చి 4న లక్డీకాపూల్‌లో జరిగే ఆర్యవైశ్య మహాసభ ఎన్నికల్లో పాల్గొని వినియోగించుకోవాలని రమణయ్య సూచించారు.

మినీ బస్సులేమాయే..?

- పాతబస్తీలో అందుబాటులో లేని మినీ బస్సులు
- గతంలో కొనసాగిన బస్సులకు ఫుల్‌స్టాప్ పెట్టిన అధికారులు
- బస్తీల్లో మినీ బస్సులు ఎంతో అవసరం అంటున్న ప్రయాణికులు



మినీ బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు (ఫైల్)

చార్మినార్: పాతబస్తీలో ఒకప్పుడు ప్రధాన రూట్‌లలో తిరిగిన ఆర్టీసీ బస్సులు రానురాను కనుమరుగవుతున్నాయి. రెవెన్యూ లేదనో..ప్రయాణికులు లేరనో..ఇలా కుంటి సాకులు చెబుతూ ఒకప్పుడున్న రూట్‌లలో ప్రస్తుతం ఆర్టీసీ బస్సుల రాకపోకలు పూర్తిగా తగ్గిపోయాయి. రెవెన్యూ రావడం లేదనే సాకుతో ఆర్టీసీ బస్సుల ట్రిప్పులను సంబంధిత అధికారులు తగ్గించారు. ఇంకా కొన్ని రూట్‌లలో పూర్తిగా తొలగించారు. దీంతో ఆయా రూట్‌లలో ఆర్టీసీ ప్రయాణికులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని రోజుల పాటు పాతబస్తీలోని అంతర్గత రోడ్లల్లో సైతం మినీ బస్సులు నడిచాయి. ఎంతో మంది స్కూలు విద్యార్థులతో పాటు ఉద్యోగులు, వ్యాపారులకు ఈ మినీ బస్సులు సౌకర్యంగా మారాయి. రానురాను వీటి ట్రిప్పులను తగ్గించిన అధికారులు ప్రస్తుతం పాతబస్తీలో కనిపించకుండా పోయాయి.

గతంలో బస్తీల్లో కొనసాగిన బస్సులకు మోక్షమెప్పుడో..?

పూర్తి స్థాయిలో బస్తీలలో మినీ బస్సులను నడపడంలో ఆర్టీసీ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. ఇరుకైన రోడ్లు.. మూల మలుపులున్న రహదారుల్లో సైతం అక్కడక్కడ పెద్ద బస్సులనే నడుపుతుండడంతో ట్రాఫిక్ సమస్యలతో పాటు ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. పాతబస్తీలో ఇప్పటికీ అనేక అంతర్గత బస్తీలున్నాయి. ఈ బస్తీలకు కొన్నింటికీ బస్సు సౌకర్యమే లేకపోగా..మరికొన్ని బస్తీలకు పెద్ద బస్సులను నడుపుతున్నారు. అంతర్గత బస్తీల్లోని ప్రయాణికులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన మినీ బస్సులు ఆశించిన ఫలితాలను సాధించడం లేదు. మినీ బస్సులను గల్లీల్లో కాకుండా ప్రధాన రోడ్లలో మాత్రమే నడపడానికి సంబంధిత ఆర్టీసీ అధికారులు ఆసక్తి కనబరుస్తున్నారు.

పెద్ద బస్సులతో తలెత్తుతున్న సమస్యలు..

బాటిల్ నెక్ రోడ్లల్లో పెద్ద బస్సులతో ఆయా రూట్‌లలో వెళ్లేందుకు ఆర్టీసీ సిబ్బంది జంకడంతో పాటు ప్రయాణికులకు సమస్యలు తలెత్తుతున్నాయి. చిన్న చిన్న వాహనాల నడుమ ఇరుక్కుపోతున్న ఆర్టీసీ పెద్ద బస్సులు ముందుకు కదిలేందుకు తీవ్ర సమయం తీసుకుంటుండడంతో తోటి వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు. ఇప్పటికే చిన్న చిన్న ప్రమాదాలు సైతం చోటు చేసుకున్నాయి. పాతబస్తీలోని అంతర్గత బస్తీలన్నింటికీ మినీ బస్సులను నడుపుతున్నామని సంబంధిత ఆర్టీసీ అధికారులు చెబుతున్నప్పటికీ..ఆచరణలో కార్యరూపం దాల్చడం లేదు. ఇకనైనా మినీ బస్సులను నడపాలని పాతబస్తీ ప్రజలు కోరుతున్నారు.

కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. సోమవారం టోలిచౌకి, మెరాజ్ కాలనీలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మెరాజ్ కాలనీలో స్థానికులను కలుసుకొని వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ పొంగిపొర్లడంపైనే తనకు ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు అవసరమైన మరమ్మతులు చేయిస్తూ డ్రైనేజీలు పొంగిపొర్లకుండా వెంటవెంటనే తాను జలమండలి, బల్దియా అధికారులను కోరామన్నారు. అదే విధంగా డ్రైనేజీ మ్యాన్‌హోళ్లకు మూతలు లేకపోవడంతో కూడా ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. ధ్వంసమైన మ్యాన్‌హోళ్ల మూతలను తొలగించి వాటి స్థానంలో నాణ్యమైన మ్యాన్‌హోళ్ల మూతలు వేయిస్తున్నామన్నారు. ఆయన వెంట నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు ఆలీముద్దీన్ తదితరులున్నారు.

‘కలహాలు కుటుంబాన్ని విచ్ఛిన్నం చేస్తాయి’



మాట్లాడుతున్న మౌలానా అలీముద్దీన్ హుస్సామీ

గోల్కొండ: దంపతులు, కుటుంబ సభ్యుల మధ్య కలహాలు కుటుంబాన్ని విచ్ఛిన్నం చేస్తాయని టోలిచౌకి సదర్ ఖాజీ మౌలానా అలీముద్దీన్ హుస్సామీ అన్నారు. సోమవారం టోలిచౌకి మెరాజ్ కాలనీలోని ఖాజీ కార్యాలయం సిబ్బందికి ఆయన కుటుంబ కలహాలు, విడాకులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నేడు యువ జంటలతో పాటు సుదీర్ఘంగా కాపురం చేస్తున్న జంటలు సైతం చిన్న చిన్న విషయాలపై గొడవపడుతూ విడాకులకు సిద్ధపడుతున్నారన్నారు. దంపతులు విడిపోవడం వల్ల కుటుంబంపై ముఖ్యంగా పిల్లలపై తీవ్ర మానసిక ఒత్తిడి కలిగిస్తుందన్నారు. ప్రభుత్వ సూచనల మేరకు తాము విడాకుల కోసం వస్తున్న జంటలకు వారి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఖాజీలు మహ్మద్, ఖదీర్ తదితరులున్నారు.

బోధనా పద్ధతులను మెరుగుపర్చుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న వివిధ కళాశాలల అధ్యాపకులు

గోల్కొండ: రోజురోజుకూ సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తుందని దీనికి అనుగుణంగా సాంకేతిక కళాశాలల అధ్యాపకులు సైతం బోధనా పద్ధతులను మెరుగుపర్చుకోవాలని షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌రెడ్డి అన్నారు. సోమవారం కళాశాలలో ఐదు రోజుల మార్గదర్శన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ప్రారంభమైంది. ఈ సందర్భంగా నగరంలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల అధ్యాపకులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఇటువంటి ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాల వల్ల అధ్యాపకులు అభిప్రాయాలను ఒకరితో ఒకరు పంచుకునే అవకాశం ఉంటుందన్నారు. సాంకేతిక రంగంలో ఒకరితో ఒకరు పోటీపడుతూ ముందుకుసాగే ఈ తరుణంలో కళాశాలల మధ్య పోటీ విద్యా ప్రమాణాల పెంపునకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.సీత, డాక్టర్ జయశ్రీ ఎస్ పాటిల్, డాక్టర్ స్వప్న, డాక్టర్ వి.విజయలక్ష్మి, డాక్టర్ రఘునాథ్ తదితరులున్నారు.

సివిల్ సర్వీసెస్ పరీక్షలపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న బి.ఎం.వినోద్‌కుమార్

నాంపల్లి: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని పోటీపడాలని మాజీ ఐఎఫ్ఎస్ అధికారి బి.ఎం.వినోద్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఆసిఫ్‌నగర్‌లోని మెస్కో గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో సీఎస్ఏ ఆధ్వర్యంలో సివిల్స్ పరీక్షలు–విద్యార్థుల లక్ష్యాలు అనే అంశంపై సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా మాజీ ఐఎఫ్ఎస్ అధికారి బి.ఎం.వినోద్ కుమార్ హాజరై విద్యార్థులకు పోటీ పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలుగు మాధ్యమంలో చదువుకున్నప్పటికీ ఎంబీబీఎస్‌తో పాటుగా ఎల్ఎల్‌బీని పూర్తిచేసినట్లు తెలిపారు. ఎంతో కష్టపడి సివిల్ సర్వీసెస్‌లో చేరాలనే తన చిన్న నాటి కలను నెరవేర్చుకున్నట్లు పేర్కొన్నారు. కెనడాకు చెందిన మీర్జా మజర్ అలీ బేగ్ మాట్లాడుతూ..జీవితంలో లక్ష్యాన్ని నిర్దేశించడం, ప్రణాళికాబద్ధంగా పనిచేయడంతోనే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని సూచించారు. సీఎస్ఏ డైరెక్టర్, చీఫ్ కౌన్సిలర్ బషీర్ అహ్మద్ విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సలేహా ఫిర్దౌస్, వైస్ ప్రిన్సిపాల్ నసీరుద్దీన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి



సమస్యలు తెలుసుకుంటున్న ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: వేసవికాలం ప్రారంభం కావడంతో నీటిఎద్దడి తలెత్తకుండా వాటర్‌బోర్డు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం అఫ్జల్‌గంజ్, గౌలిగూడ, రామ్‌మందీర్, అశోక్ బజార్ తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ..వాటర్‌బోర్డు, విద్యుత్, రెవెన్యూ ఇతర ఏ శాఖల్లోనైనా ప్రజలు తమ తమ సమస్యలు తమ దృష్టికి తెస్తే వెంటనే సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రవియాదవ్, రామకృష్ణ, రామ్మోహన్, రాజు, నర్సింహా, భజన్ సింగ్, మంజుల, వాణి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్ రావు, ఇన్‌స్పెక్టర్ రవీందర్, డీఐ దిలీప్ కుమార్

డబీర్‌పురా: ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను మీర్‌చౌక్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మీర్‌చౌక్ ఏసీపీ ఎస్.ఎస్.ఎస్.వి. వెంకటేశ్వర్‌రావు ఇన్‌స్పెక్టర్ రాచకొండ రవీందర్, డీఐ ఎస్.దిలీప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..నూర్‌ఖాన్‌బజార్‌కు చెందిన మహమ్మద్ నూర్ హసన్ (33), ఫర్హత్‌నగర్‌కు చెందిన హిమాయత్ హుస్సేన్ అన్సారీ అలియాస్ హిమాయత్ (23)లు ఈ నెల 4న కాలికబర్‌కు చెందిన మహ్మద్ ఇమ్రాన్ ఇంట్లోకి చొరబడి తాళాలు పగలగొట్టి ఇంట్లోని 30 గ్రాముల బంగారం, రూ.2 లక్షల నగదు, ఐదు పాస్‌పోర్టులు, మూడు ఆర్సీ బుక్‌లు, ఒక రాడో వాచ్‌లను దొంగలించారు.

దీనిపై బాధితుని ఫిర్యాదు మేరకు మీర్‌చౌక్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దొంగతనానికి పాల్పడిన మహమ్మద్ నూర్ హసన్, హిమాయత్ హుస్సేన్ అన్సారీలను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి బంగారు ఆభరణాలు, నగదును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

ఉద్యోగ శాసనమండలి సభ్యులను ఏర్పాటు చేయాలి

గన్‌ఫౌండ్రీ: ఉపాధ్యాయుల సమస్యలను తెలిపేందుకు శాసన మండలిలో ఒక ఎమ్మెల్సీ పదవి ఉన్నట్లుగా ఉద్యోగుల కోసం కూడా ఒక ఎమ్మెల్సీ పదవిని కల్పించాలని వ్యవసాయ విస్తరణ అధికారి కె.పరశురాములు కోరారు. ఈ మేరకు సోమవారం ఉద్యోగ శాసన మండలి సభ్యులను ఏర్పాటు చేయాలని కోరుతూ సచివాలయంలోని సీఎం కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగస్తులు తమ హక్కులు, అవసరాలు, అలవెన్సుల వంటి పలు సమస్యలపై తమ గళాన్ని వినిపించేందుకు ఉద్యోగ ఎమ్మెల్సీ పదవిని కేటాయించాలని కోరారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నోటిఫికేషన్లతో పాటుగా ఉద్యోగ ఎమ్మెల్సీ ఎన్నికలు కూడా నిర్వహించాలని కోరారు.

సన్మానం



రాజనారాయణ్‌ను సన్మానిస్తున్న ప్రొఫెసర్ కుమార్

చార్మినార్: సమాజ సేవలో 40 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ సిటిజెన్స్ కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ రాజనారాయణ్ ముదిరాజ్‌ను ఉస్మానియా యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కుమార్ సోమవారం ఘనంగా సత్కరించారు. పాతబస్తీకి చెందిన డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ ఓవైపు ప్రభుత్వ విధి నిర్వహణ కొనసాగిస్తూనే మరోవైపు స్వచ్ఛందంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో దుర్గ పాల్గొనడం సంతోషకరమన్నారు. స్వచ్ఛంద సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలను ఆయన 4 దశాబ్దాలుగా నిరంతరం నిర్వహించడం అభినందనీయమన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గౌలిపురా: బెలూన్ గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో తీవ్ర గాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం..సుల్తాన్‌షాహీ కాలిపాటక్ ప్రాంతానికి చెందిన షబ్బీర్ అలీ (36) వీధుల్లో గ్యాస్ బెలూన్‌లను విక్రయిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 2న ఉదయం 11.40 గంటల సమయంలో షబ్బీర్ అలీ బెలూన్ గ్యాస్ సిలిండర్‌ను ఇంట్లో మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు ఆ సిలిండర్ పేలి షబ్బీర్ అలీ తీవ్ర గాయాలకు గురయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు షబ్బీర్ అలీని శాలిబండలోని ఆస్రా ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న షబ్బీర్ అలీ ఈ నెల 9న మృతి చెందినట్లు వైద్యులు తెలిపినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడుతున్న యువకుడి అరెస్టు

బంజారాహిల్స్: ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న యువకుడిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12లోని శ్రీరామ్‌నగర్ బస్తీకి చెందిన మహ్మద్ సాబేర్ (30) కొంతకాలంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసయ్యాడు. ఆదివారం వెబ్ అప్లికేషన్‌లో గోల్డ్ 365.కామ్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడుతుండగా సమాచారం అందుకున్న బంజారాహిల్స్ ఎస్ఐ ఎండీ.యాసిన్ అలీ నిందితుడిని పట్టుకున్నాడు. నిందితుడి నుంచి ఆన్‌లైన్ బెట్టింగ్ ఫోన్‌తో పాటు ఇతర పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్

సుల్తాన్‌బజార్: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ అన్నారు. ఈ మేరకు సోమవారం జాంబాగ్ డివిజన్‌లో బద్రి విశాల్ కన్నాలాల్ పిట్టి ట్రస్ట్ తెలంగాణ జైస్వాల్ సేవా సమితి అగర్వాల్ సేవాదళ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జాంబాగ్ డివిజన్‌లోని చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు వివిధ వైద్య సేవలను వినియోగించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..స్వచ్ఛంద సంస్థలు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రదీప్ అగర్వాల్, సుధీర్‌గుప్తా, సురేందర్ గోయేల్, అజయ్, కాజల్, మయూర్, రేణుకా, రంజిత, సందీప్, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుల తడకగా బీసీల కుల గణన



సమావేశంలో బీసీ సంఘం నాయకుడు ఆకుల శ్రీనివాస్ తదితరులు

చాంద్రాయణగుట్ట: బీసీ కుల గణనపై కాంగ్రెస్ ప్రభుత్వం కాకి లెక్కలు చెబుతూ మరోసారి బీసీలను మోసం చేసేందుకు కుట్ర పన్నుతుందని బీసీ సంఘం నాయకుడు ఆకుల శ్రీనివాస్ అన్నారు. ఉప్పుగూడ సాయిబాబానగర్‌లో సోమవారం బీసీ సంఘం నాయకులు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ..స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు పెంచడం కోసం అసెంబ్లీలో బిల్లు పెట్టకుండా తూతూ మంత్రంగా సమావేశాన్ని ముగించిందన్నారు. బీసీ జనాభాను తక్కువ చేసి చూపి..ఓసీ జనాభాను ఎక్కువగా చూపిందన్నారు. పథకాలలో బీసీలకు కోత విధించి, రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా, ఉద్యోగపరంగా అణచివేసే కుట్ర జరుగుతుందన్నారు. త్వరలోనే పాతబస్తీలోని బీసీ కుల సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు తిరుపతి శివకుమార్, చెన్నయ్యగారి సరిత రజక, పద్మశాలి సంఘం అధ్యక్షుడు గుర్రం ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి మన్న సతీష్, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకుడు హేమంత్ చారి, నాయి బ్రాహ్మణ సంఘం నాయకుడు లింగం, శంకర్ ముదిరాజ్, మైనార్టీ నాయకుడు, భిక్షపతి, ప్రవీణ్, నదీం తదితరులు పాల్గొన్నారు.

కుక్కల బెడద నుంచి కాపాడండి



చార్మినార్: తమ స్కూల్ పరిసరాల్లో కుక్కల బెడద ఎక్కువైందని..వాటి నుంచి తమను కాపాడాలని కోరుతూ కొంత మంది విద్యార్థులు జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. జోనల్ కమిషనర్ వెంకన్న పర్యవేక్షణలో జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో చార్మినార్ సర్కిల్ పరిధిలోని ఫోకస్ హైస్కూల్ విద్యార్థులు కుక్కల బెడదపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ప్రజలు స్థానికంగా నెలకొన్న సమస్యలపై ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదులపై తక్షణమే స్పందించి సంబంధిత విభాగాలచే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ శైలజ, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ రాజారావు, మలేరియా సీనియర్ ఎంటమాలజిస్ట్ నామాల శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఈఈ రామారావు, బిల్ కలెక్టర్ రాజేష్ పాల్గొన్నారు.

రంగరాజన్‌పై దాడికి పాల్పడటం అత్యంత హేయం

సుల్తాన్‌బజార్: చిల్కూరు బాలాజీ ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడిని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రచార ప్రసార ప్రముఖ్ పగడాకుల బాలస్వామి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య దేశంలో దాడులు, దౌర్జన్యాలకు స్థానం లేదని పేర్కొన్నారు. రాడికల్ మూమెంట్ చెల్లదని ఆయన హెచ్చరించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం కల్పించి, అత్యంత క్రమశిక్షణలతో ఆలయాన్ని నిర్వహించడం రంగరాజన్ ప్రత్యేకత అన్నారు. సమాజంలో అంటరానితనాన్ని తూడ్చి వేసేందుకు రంగరాజన్ తీవ్రంగా కృషి చేస్తున్నారని, ఇలాంటి సందర్భంలో ఆయనపై దాడికి పాల్పడటం అత్యంత హేయమని ఆందోళన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన దుండగులను చట్టపరంగా శిక్షించాలని బాలస్వామి డిమాండ్ చేశారు.

ప్రభుత్వ వైఫల్యమే..

చాంద్రాయణగుట్ట: చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి చేయడం దుర్మార్గమైన చర్య అని బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జాలిగం చిరంజీవి అన్నారు. పార్టీ సీనియర్ నాయకులు బర్ల శ్రీనివాస్, పెండెం లక్ష్మణ్, గంజి వేణుతో కలిసి సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రంగరాజన్‌పై 20–30 గూండాలు దాడి చేయడం సహించరాని విషయమన్నారు. ఈ ఘటనపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టి అసలైన నిందితులను గుర్తించాలన్నారు. ఆలయాలు, అర్చకులపై దాడి జరగడానికి ప్రభుత్వ వైఫల్యమే కారణమన్నారు.

ఇరానీయులకు శుభాకాంక్షలు



చార్మినార్: ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ 46వ వార్షికోత్సవంతో పాటు జాతీయ దినోత్సవం సందర్భంగా ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ కౌన్సిల్ జనరల్ మహదీ షారోఖిని బీజేపీ సీనియర్ నాయకుడు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ కలిసి అభినందనలు తెలిపారు. శాలువా కప్పి కేక్ తినిపించి దేశ ప్రజలకు తన తరఫున శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ మాట్లాడుతూ..దేశంలోని పలు ప్రాంతాల్లో నివసిస్తున్న ఇరానీయులు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతున్నానన్నారు.